క్లుప్తంగా

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి



గంగిరెడ్డిపల్లిలో సమస్యలపై అర్జీలను స్వీకరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పుట్టపర్తి అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పెదపల్లి, గంగిరెడ్డిపల్లి, నిడిమామిడి గ్రామాల్లోని పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మాధవ, ప్రధాన కార్యదర్శి చంద్ర, నాయకులు రాజశేఖర్, నరేష్, రాం ప్రసాద్ సుధాకర్ తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర అవుతున్నా పట్టించుకోలేదన్నారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కరించలేదన్నారు. వెంటనే పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థులకు అసెస్‌మెంట్ బుక్ లెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అనుమతి లేని పాఠశాలకు అధికారుల మద్దతా?



మాట్లాడుతున్న ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు

బత్తలపల్లి: ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలను మూసివేయాల్సిన అధికారులే మద్దతుగా నిలుస్తున్నారని ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో అసోసియేషన్ నాయకులు వెంకటకృష్ణ, మిడతల లక్ష్మీనారాయణ, జాంపుల వెంకటరాముడు, శ్రీకాంత్ విలేకరులతో మాట్లాడారు. బత్తలపల్లిలో అనుమతి లేని ఫోనెక్స్ గ్లోబల్ స్కూల్లో అడ్మిషన్లు చేసుకుంటూ ఆన్‌లైన్‌లో జిల్లాలోని ఇతర బ్రాంచ్‌లలో చూపుతున్నారన్నారు. సదరు పాఠశాలకు 400 మీటర్ల దూరంలోనే 4 పాఠశాలలున్నాయన్నారు. సదరు పాఠశాలను ఎంఈఓ-1 తనిఖీ చేసి 1 నుంచి 7వ తరగతి వరకూ తరగతుల నిర్వహణకు అనుమతి కోసం సిఫారసు చేయడమేగాక అధిక ఫీజుల వసూలుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంలో మతలబేంటని ప్రశ్నించారు. పర్మిషన్ లేకున్నా పాఠశాల నిర్వహించుకోవడానికి తోడ్పాటు నందిస్తున్న ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వంటల మేళా



స్టాల్‌ను పరిశీలిస్తున్న పట్టణ ప్రముఖులు

పుట్టపర్తి టౌన్: హనుమాన్ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం టింబక్ట్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన సంప్రదాయ వంటల మేళా ఏర్పాటు చేశారు. మేళా శనివారం కూడా కొనసాగుతుందని నిర్వాహకులు శంకర్, జైష్ణవి, క్రిష్ణా, రాజశేఖర్, రమేష్ కుమార్ తెలిపారు. చిరుధాన్యాలు, సేంద్రియ పద్ధతులతో చేసిన ఆహార పదార్థాలతో ఆరోగ్యం చేకూరుతుందని వారు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతం



వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్రతానికి కావాల్సిన సామగ్రిని దేవస్థానం వారే సమకూర్చారు. ప్రధాన అర్చకులు ఎ.డి.పార్థసారధి చార్యులు శ్రీవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం వరలక్ష్మి వ్రతాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. దాదాపు 250 మంది మహిళలు వ్రతాన్ని ఆచరించారు. వారికి అమ్మవారి దర్శనం, నివేదన ప్రసాదంతో పాటు అన్నప్రసాద సదుపాయము కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

బత్తలపల్లి: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు శ్రావణమాస పూజలు చేపట్టారు. పోట్లమర్రిలోని యల్లమ్మ, పెద్దమ్మ, గంటాపురంలోని మారెమ్మ, బత్తలపల్లిలోని బళ్లారి దుర్గమ్మ, కొల్లాపురమ్మ, అంకాలమ్మ, పెద్దమ్మ, గంగమ్మ, మహాలక్ష్మీ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ మాసంలో ఆచరించే పూజలు, ఆరాధనలు, అర్చనలు, వ్రతాలు, జపాలు, హోమాలు సత్వరమే సిద్ధించడంతో పాటు దాని కత్రఫలం చేసిన వారికి అందుతుందని భక్తుల విశ్వాసం. మహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసంగా వేదంలో పేర్కొనట్లు పండితులు చెబుతున్నారు.

గణపయ్య ఉత్సవాలు చేద్దామిలా..

- వినాయక ఉత్సవ నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి
- గణేష్ ఉత్సవ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి
- జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవు
- విగ్రహ కమిటీలూ జాగ్రత్త అంటున్న పోలీసులు



గత ఏడాది ఉత్సవాల్లో నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న అప్పటి ఎస్ఐ శ్రీనివాసులు(ఫైల్)

బత్తలపల్లి: మన ఊరిలో.. వీధిలో వినాయక విగ్రహం ఏర్పాటు చేయాలనుకుంటున్నారా? నిమజ్జనం ఎప్పుడైతే ఏముందిలే అనుకుంటున్నారా? డీజేల సౌండ్‌లతో హోరెత్తిద్దామనుకుంటున్నారా? చాలా సంతోషమండి మీ ఉత్సాహానికి. అయితే ఇక్కడే ఉంది తిరకాసు. విగ్రహాల ఏర్పాటుకు అనేక నిబంధనలున్నాయ్ అంటున్నారు పోలీసులు. ఏమాత్రం చిన్న పొరపాటు జరిగినా అందరూ ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందంటున్నారు. ఈనెల 27వ తేదీన వినాయక చవితి పర్వదినం నేపథ్యంలో ఉత్సవ కమిటీలు పాటించాల్సిన నిబంధనలు ఇలా ఉన్నాయి.

- ఉత్సవాల నిర్వహణకు అనుమతులు కోసం ప్రత్యేకంగా గణేష్ ఉత్సవ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి.
- సింగిల్‌విండో విధానంలో అనుమతులు పొందాలి. ఇందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు.
- విగ్రహాల ఏర్పాటుకు కమిటీలు తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలి.
- వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రాంతాల్లో ఏర్పాటు చెయ్యరాదు.
- విగ్రహాల వద్ద గానీ, నిమజ్జనాల రోజున గానీ అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేయ్యరాదు. టపాసులు కాల్చడం, రంగులు చల్లుకోవడం చెయ్యకూడదు.
- మైక్ పర్మిషన్ తీసుకుని, అందులోని నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి.
- విద్యుత్‌శాఖ అనుమతి తీసుకుని తాత్కాలికంగా విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేసుకోవాలి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి.
- బలవంతపు వసూళ్ల(చందాలు)కు పాల్పడరాదు.
- మసీదుల వద్ద విగ్రహాలు ఏర్పాటు చేసేవారు నమాజు సమయంలో సౌండు తక్కువగా ఉంచాలి.
- నిమజ్జనం సమయంలో కొత్తవారు గానీ, అనుమానిత వస్తువులు కానీ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.
- విగ్రహాల వద్ద నిమజ్జన సమయంలో భక్తులు మత్తు పానీయాలు సేవించరాదు. ఇందుకు కమిటీ బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- రాత్రి 11 గంటకల్లా విగ్రహాల వద్ద కార్యక్రమాలు పూర్తి చేయాలి.
- ఆభరణాలు ధరించి మహిళలు విగ్రహాల వద్దకు రాకుండా కమిటీలు జాగ్రత్తలు తీసుకుని, దొంగతనాలను నియంత్రించాలి. విగ్రహాల వద్ద నిఘా ఏర్పాటు చేసుకోవాలి.
- మండపం సమీపానికి పందులు, కుక్కలు మొదలైన జంతువులు రాకుండా నిరోధించాలి. మండపం స్టేజీ కింద ఖాళీ స్థలమును చెక్కతో మూసి వేయాలి.
- మండపాల్లో పేకాట ఆడకుండా, మత్తు పదార్థాలు సేవించకుండా నిర్వహకులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- సోషల్ మీడియా, వాట్సాప్ మాధ్యమాల ద్వారా వచ్చే పుకారులను నమ్మవద్దు. వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేయవద్దు.
- సంధ్యాసమయానికి ముందే నిమజ్జన ప్రక్రియ పూర్తి చేయాలి.
- విగ్రహాల రక్షణకు పగలూ, రాత్రి నలుగురు చొప్పున విగ్రహాల వద్ద ఉంటూ కమిటీలే భద్రత కల్పించుకోవాలి.
- రాజకీయ పార్టీల గుర్తులు ధరించిన కమిటీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

ఎలాంటి ఘటనలు జరిగినా కఠిన చర్యలు



వినాయక మండపాల నిర్వాహకులతో మాట్లాడుతున్న టూ టౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం అర్బన్: వినాయక మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కఠిన చర్యలు తప్పవని టూ టౌన్ సీఐ రెడ్డప్ప హెచ్చరించారు. స్థానిక టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వినాయక ఉత్సవాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతివార్డులో వినాయక పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

డ్యాన్సులు ఏర్పాటు చేస్తే కేసులు..



వినాయక చవితి సందర్భంగా ఉత్సవ కమిటీలు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. నిమజ్జనాల సమయంలో డ్యాన్సర్లతో డ్యాన్సులు వేయిస్తే సహించేది లేదు. కచ్చితంగా అదేరోజు సాయంత్రానికి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తాం. ఇందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేవు. లౌడ్ స్పీకర్లు, విద్యుత్‌శాఖ అనుమతులు తప్పనిసరిగా పొందాలి. విగ్రహాల వద్ద అనుమానిత వస్తువులు, కొత్త వ్యక్తులు గానీ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

–ప్రభాకర్, సీఐ, ధర్మవరం రూరల్

అనుమతులు తప్పనిసరి



ఏ గ్రామంలోనైనా విగ్రహాలు ఏర్పాటు చేయాలనుకుంటే పోలీసుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. అక్కడ ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు పోలీసులకు ఇవ్వాలి. ఇష్టారాజ్యంగా కాకుండా విగ్రహాలన్నీ ఒకేసారి ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం చేయాలి. విగ్రహం ఏర్పాటుకు అనుమతులు పొందే రోజే నిమజ్జనం చేసే రోజు కూడా తెలపాలి. అక్కడ ఏమైనా సంఘటనలు జరిగితే ఆ సమాచారాన్ని పోలీసులకు ఉత్సవ కమిటీ సభ్యులు అందించాలి.

–సోమశేఖర్, ఎస్ఐ, బత్తలపల్లి.

జిల్లా కేంద్రాన్ని తరలిస్తే ప్రతిఘటిస్తాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓడీచెరువు: జిల్లా కేంద్రాన్ని తరలిస్తే ప్రతిఘటిస్తామని వైఎస్సార్‌సీపీ అమడగూరు మండల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం అమడగూరులో వారు విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో జిల్లాలోని అన్నిప్రాంతాలకు అనుకూలంగా ఉండనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. అప్పటి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఇందుకోసం ప్రత్యేక చొరవ తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఒత్తిడితో జిల్లా కేంద్రాన్ని హిందూపురం తరలించాలను కోవడం సరికాదన్నారు. జిల్లా కేంద్రానికి అన్నివిధాలుగా అనువుగా ఉన్న పుట్టపర్తిని మారిస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జయప్ప, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శేషురెడ్డి, మాజీ జెడ్పీటీసీ పుట్టా పురుషోత్తం రెడ్డి, సర్పంచ్ సురేంద్రరెడ్డి, బల్రాజుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మధు, మండల యూత్ అధ్యక్షుడు ఎస్పాల్, వలంటీర్ విభాగం అధ్యక్షులు సురేష్, కో ఆప్షన్ మెంబర్ ఖాజాపీర్, టౌన్ కన్వీనర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

ఆర్డీటీ సేవలు కొనసాగించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఆర్డీటీ సేవలు కొనసాగించాలని కదిరి ప్రాంత వాసులు, మహిళ సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు కదిరి తహసీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా చేపట్టారు. అంతకు ముందు పట్టణంలోని జీవిమాను సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డీటీ పేదలకు ఒక వరం లాంటిదన్నారు. నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు, పేద విద్యార్థులకు ఉచిత విద్యను ఆర్డీటీ అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను రెన్యూవల్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గంగన్న, వేమన్న, శ్రీరాములు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను రెన్యూవల్ చేయాలని వివిధ గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలియజేశారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్‌ను రెన్యూవల్ చేయాలనితహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం దివ్యాంగుల పింఛన్లను కొనసాగించాలని ఎంపీడీఓ శివరాంప్రసాద్ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు గంగాభవాని, సర్పంచ్ గోవింద్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరునికీ ఓటు హక్కు తప్పనిసరి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: ప్రతి పౌరునికీ ఓటు హక్కు తప్పనిసరని ఆర్డీఓ మహేష్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని 295 పోలింగ్ బూత్‌లకు 295 మంది బీఎల్ఓలను నియమించామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, ఇతర సమస్యలను తెలియజేయాలన్నారు. 18 సంవత్సరాలు వయసు నిండిన యువతి, యువకులు ఎన్‌వీఎస్‌టీ యాప్, ఓటర్ హెల్ప్ యాప్‌ను ఉపయోగించుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాలు త్వరగా కార్యాలయంలో అందించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్య, సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డి, సిబ్బంది రాజకుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించాలి

ధర్మవరం రూరల్: ఎమ్మార్పీకే ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని ఆర్డీఓ మహేష్ వ్యాపారులకు సూచించారు. శుక్రవారం యూరియా, డ్యాప్ ఎరువుల లభ్యత, అమ్మకాలపై ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, బిల్లులు, విక్రయ రికార్డులు, ధరల పట్టిక, ఎరువుల సంచుల నాణ్యత, డీలర్ల లైసెన్స్‌లు, నిల్వ సదుపాయం తదితర వాటిని పరిశీలించారు. ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో వ్యవసాయం కీలకం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

పుట్టపర్తి టౌన్: దేశాభివృద్ధిలో వ్యవసాయం కీలకమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. శుక్రవారం గోరంట్ల సమీపంలో ఉన్న బెస్ట్ యూనివర్సిటీలో జాతీయ వ్యవసాయ సాంకేతిక సదస్సు జరిగింది. పద్మశ్రీ అవార్డు గ్రహీత తెలంగాణకు చెందిన మల్లేశం, కర్ణాటక ప్రభుత్వ అగ్రికల్చర్ ఓఎస్డీ డాక్టర్ బీఏ పాటిల్, బెస్ట్ యూనివర్సిటీ చైర్మన్ భరత్‌లాల్‌మీనా, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దివ్య, నార్మ్ డైరెక్టర్ డాక్టర్ రాజగోపాల్ సదస్సును ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. బెస్ట్ యూనివర్సిటీ విద్యార్థులు అధిక దిగుబడి నిచ్చే విత్తనాలు, నూతన రకం వంగడాలు సృష్టించి అందరిచేత ప్రశంసలు పొందడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీడీఓ నరేంద్రకుమార్, వర్సిటీ ప్రతినిధులు జయప్రకాశ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

'బుడ్డా'ను ఎమ్మెల్యే పదవి నుంచి తప్పించాలి

కదిరి: అటవీశాఖ సిబ్బందిపై దాడి చేసిన శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతోపాటు ఎమ్మెల్యే పదవి నుంచి తప్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కదిరి తాలూకా అధ్యక్షుడు జి.ఫక్రుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాయసం హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే అధికారాన్ని అడ్డుపెట్టుకొని రౌడీ మూకలను పెంచిపోషిస్తూ ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారని వారు మండిపడ్డారు. అటవీసిబ్బందిపై కక్ష సాధించాలనే ఉద్దేశంతోనే ఆయన దాడికి పాల్పడినట్లు అర్థమవుతోందని పేర్కొన్నారు. ఏడాది కాలంగా 'బుడ్డా' ఆగడాలను చూసి స్థానిక ప్రజలంతా చీదరించుకుంటున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్‌కళ్యాణ్ ఈ విషయంపై స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడిని పల్లకీపై ఊరేగిస్తున్న భక్తులు

పుట్టపర్తి అర్బన్: కొత్తచెరువులో వారం రోజులుగా ప్రబోదానంద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం ముగిశాయి. వేడుకల్లో భాగంగా రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం చేపట్టారు. చివరి రోజు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పల్లకీపై ఉంచి ప్రధాన రహదారిపై ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగేంద్ర, గంగరత్న, నాగభూషణ, రెడ్డెప్ప, శివశంకర్, బాలాజీ,పవన్, రాము, శాంతి, సాయినాథ్, కల్పన, లలిత, పద్మ, పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగుల పింఛన్లు కొనసాగించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘం సభ్యులు

ధర్మవరం: అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు తొలగించడం అన్యాయమని, వారి పింఛన్లు కొనసాగించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు లలిత, కార్యదర్శి నాగరాజు, సభ్యులు అనిత, లావణ్య, లీలావతి, ప్రేమలత కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో దివ్యాంగుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసి అర్హులైన దివ్యాంగుల పింఛన్లు కూడా తొలగించారన్నారు. అనర్హులను తొలగించి అర్హుల పింఛన్లు యథావిధిగా కొనసాగించాలని విన్నవించారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరం సంబంధించి ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మక్బూల్ హుస్సేన్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ మ్యాథ్స్, బీఏ ఎకనామిక్స్, బీఏ స్పెషల్ తెలుగు కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో నెట్‌సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన అధ్యాపకులుతో బోధన, గేమ్స్, కెరీర్ గైడెన్స్ సెల్, ఎస్ఎస్ఎస్ స్కాలర్‌షిప్, సదుపాయాలు అందబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 9160044786, 961883847 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గడువులోపు ఈ– క్రాప్ నమోదు చేయండి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ లక్ష్మానాయక్

ధర్మవరం రూరల్: గడువులోపు ఈక్రాప్ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని రైతు సేవా కేంద్ర సిబ్బందికి ఏడీఏ లక్ష్మానాయక్ సూచించారు. శుక్రవారం పోతుకుంట గ్రామ పొలాల్లో చేపట్టిన పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతు రైతులు తప్పని సరిగా ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ఏఓ ముస్తఫా, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీమీలేయర్ విధానాన్ని తొలగించాలి

కదిరి టౌన్: క్రిమిలేయర్ విధానాన్ని తొలగించాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో 6.5 లక్షల ఉన్న ఓబీసీల క్రిమీలేయర్ ఆదాయ పరిమితిని 2017లో రూ.8 లక్షలకు పెంచారన్నారు. ఎనిమిదేళ్లవుతున్నా ఆదాయ పరిమితిని సవరించకపోవడం ఓబీసీలకు అన్యాయం చేయడమేనన్నారు. ఓబీసీల సమగ్రాభివృద్ధికి మండల్ కమిషన్ విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేసిందని, కేంద్రం రిజర్వేషన్లు అమలుకు క్రీమీలేయర్ పెట్టడం అన్యాయమన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టీడీ టీకాలు

తాడిమర్రి: తాడిమర్రి, కునుకుంట్ల, పిన్నదరి, దాడితోట, నిడిగల్లు, ఆత్మకూరు, ఎం.అగ్రహారం, పెద్దకోట్ల తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు శుక్రవారం 5 నుంచి 16 ఏళ్లలోపు విద్యార్థులకు టెటనస్, డిఫ్తీరియా(టీడీ) టీకాలను వేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ పిల్లలకు ఈ టీకాలు వేయడంతో గాయాలు అయినప్పుడు టీటీ వేయడం ఆలస్యం అయినా గాయాలు ఇన్‌ఫెక్షన్ కాకుండా ఉంటాయన్నారు. గొంతుకింద గడ్డలు రావన్నారు. టీకాలు వేయించుకున్న వారికి స్వల్పంగా జ్వరం వస్తుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

సంక్షిప్త సమాచారం

స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి: స్త్రీనిధి రుణాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. శుక్రవారం ఆమె కనగానపల్లిలో డ్వాక్రా సంఘాల మహిళలకు స్త్రీ నిధి రుణాలను సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రాయితీ వడ్డీతో అందించే రుణాలకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్త్రీనిధి బ్యాంకు ద్వారా కనగానపల్లి మండలానికి 513 డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ 4.46 కోట్లు మంజూరు చేసినట్లు వెలుగు డీపీఎం సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నెట్టం వెంకటేష్, మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్, ఏపీఎం హేమలత, మండల గ్రామైక్య సంఘం లీడర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా



దేవిరెడ్డిపల్లివద్ద బోల్తా పడిన లారీ

నల్లచెరువు: దేవిరెడ్డిపల్లి వద్ద కుక్కలను తప్పించే క్రమంలో శుక్రవారం లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. అన్నమయ్య జిల్లా మొలకలచెరువులోని ఓ టమాట మండిలో టమాట క్రేట్లు లోడ్ చేసుకున్న లారీ కదిరి వైపు బయలుదేరింది. అయితే దేవిరెడ్డిపల్లి వద్దకు రాగానే జాతీయ రహదారిపై లారీకి కుక్కల గుంపు అడ్డుగా వచ్చాయి. గమనించిన లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో లారీ నియంత్రణ కోల్పోయి హైవే పక్కన బోల్తా పడింది. ప్రమాదంలో తమిళనాడుకు చెందిన డ్రైవర్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

కనగానపల్లి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవ అవార్డులు పొందిన ఎంఐఎస్ కోఆర్డినేటర్ రామన్న, భవిత కేంద్రం వలంటీర్ మాదమ్మను శుక్రవారం పలువురు సన్మానించారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈఓ అరుణమ్మ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది వారికి పూలమాలలు, శాలవాలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేజీబీవీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు నరసమ్మ, రవికిరణ్, జెడ్పీ పాఠశాల హెచ్ఎం ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ మేనేజర్‌కు సన్మానం



బ్యాంకు మేనేజర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గాండ్లపెంట: స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న మేనేజర్ భరత్ ప్రవీణ్‌కు బ్యాంకు సిబ్బంది, వెలుగు సిబ్బంది, ఖాతాదారులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీఎం సూర్యనారాయణ మేనేజర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ శ్రావణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
7093150088, 7093157766
9912220726, 9912220717